సాక్షి అనకాపల్లి

బుధవారం । 4 । అక్టోబర్ । 2023



త్యాగరాజ ఆరాధనోత్సవం

విశాఖ: శ్రీమారుతి నాయీ బ్రాహ్మణ నాదస్వర డోలు కళాకారులు శ్రీత్యాగరాజ ఆరాధన ఉత్సవం ఘనంగా నిర్వహించారు.



అష్టదళ పద్మారాధన

విశాఖ: కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.

వర్ష సూచన

రాగల అయిదు రోజుల్లో జిల్లాలో వాతావరణం మేఘావృతమై ఉండి తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జగన్నాథరావు చెప్పారు. గాలిలో తేమ ఉదయం 73–81 శాతం, మధ్యాహ్నం 62–71 శాతం ఉండవచ్చన్నారు. గాలి గంటకు 9 కి.మీ.వేగంతో వీయవచ్చని తెలిపారు.

న్యూస్‌రీల్

జాతీయ హాకీ జట్టు గోల్‌కీపర్‌గా శైలజ



యలమంచిలి: భారత సబ్ జూనియర్ బాలికల హాకీ జట్టుకు గోల్‌కీపర్‌గా అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఎ.భీమవరం గ్రామానికి చెందిన తర్ర శైలజ ఎంపికైనట్టు మంగళవారం జిల్లా హాకీ అసోసియేషన్ కన్వీనర్ ఆడారి వీరునాయుడు తెలిపారు. ఇటీవల జాతీయ హాకీ శిక్షణ శిబిరంలో శైలజ ప్రతిభ కనబరిచడంతో అండర్ 17 సబ్‌జూనియర్ బాలికల విభాగంలో జాతీయ హాకీ జట్టుకు గోల్‌కీపర్‌గా ఎంపికైందన్నారు. ఈ నెల 7 నుంచి, 15 తేదీ వరకు నెదర్లాండ్స్‌లో జరిగే అంతర్జాతీయ హాకీ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ ఏడాది జనవరిలో యలమంచిలిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాలికల సబ్ జూనియర్ హాకీ పోటీల్లో ప్రతిభ చూపి జట్టు విజయానికి ఎంతో కృషి చేసిందని, అనకాపల్లి జిల్లా నుంచి జాతీయ స్థాయి హాకీ జట్టుకు గోల్‌కీపర్‌గా ఎంపికైన మొట్టమొదటి క్రీడాకారిణి శైలజ అని అన్నారు. ఈ సందర్భంగా ఆమెను జిల్లా హాకీ అసోసియేషన్ సభ్యులు, కోచ్‌లు, రమేష్, ఖాదర్‌బాషా, మహేష్, రాంబాబు, సాయి, నరేష్, యమున, వరహాలురెడ్డి, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

కళాకారుల గుర్తింపు కార్డులకు దరఖాస్తులు

తుమ్మపాల: జిల్లాలో వివిధ రకాల కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.ఇంద్రావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లలిత కళలు, పౌరాణిక సాంఘిక, వీధి నాటకాలు, హరికథలు, బృందగానాలు, డప్పు వంటి కళారూపాలలో ప్రదర్శనలిచ్చిన కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. వృత్తి కళాకారులుగా ప్రశంసా పత్రాలు, కళారూపం ప్రదర్శన ఫొటోలతో పాటు కళాకారులుగా గుర్తింపు ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా పౌర సమాచార శాఖ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీలోపు అందజేయాలని సూచించారు.

ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మగ్గం వర్క్‌పై శిక్షణ

అనకాపల్లిటౌన్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి భారతీయ స్టేట్ బ్యాంక్(ఎస్‌బీఐ) గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా గ్రామీణ ప్రాంత మహిళలకు ఈ నెల 26 నుంచి 30 రోజుల పాటు ఎంబ్రాయిడరీ ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ సంచాలకులు బి.విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల్లోపు వయసు కలిగిన మహిళలకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆధార్, తెల్ల రేషన్ కార్డు కలిగిన గ్రామీణ ప్రాంత మహిళలు మాత్రమే అర్హులన్నారు. వివరాలకు 8008333509 నంబరును సంప్రదించాల్సిందిగా కోరారు.

నూకాంబిక ఆలయంలో ఓపెన్ టెండర్లు



ఆన్‌లైన్ ఓపెన్ టెండర్‌లో పాల్గొన్న చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో ప్రసాద్

అనకాపల్లి టౌన్: గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో మంగళవారం వివిధ అంశాలకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా ఓపెన్ టెండర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్‌లు మాట్లాడుతూ రసవర్గాలు (వంటసామగ్రి), తలనీలాలు, అమ్మవారి ఫొటోలు, డాలర్లు, షామియానాలు, అద్దెకు కుర్చీలు, పూలదండలు, పుష్పాలంకరణ, భక్తులు సమర్పించిన చీరల వేలం వంటి అంశాలపై ఆన్‌లైన్‌లో ఓపెన్ టెండర్ నిర్వహించినట్టు చెప్పారు. రెండు రోజుల్లో టెండర్లు పరిశీలించి ఖరారు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఆలయ ధర్మకర్తలు బుద్ధ నర్సింగరావు, పీలా లక్ష్మీ శ్రీనివాసరావు, ఆడారి ఉమా శ్రీనివాసరావు, గొల్లవిల్లి నర్సింగరావు, పాముల సన్నిబాబు, మళ్లవరపు ఈశ్వరరావు, ఎ.శ్రీను, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షకు ప్రజా వెల్లువ



అనకాపల్లి మండలం మారేడుపూడి గ్రామంలో వృద్ధుడిని వైద్యుని వద్దకు తీసుకువెళుతున్న దృశ్యం

- అన్ని సచివాలయాల పరిధిలో వైద్యశిబిరాలు
- రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలి
- డీఎంహెచ్‌వో హేమంత్ ఆదేశం

నక్కపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు వచ్చే రోగులకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ హేమంత్ ఆదేశించారు. మంగళవారం ఆయన డీఎల్‌పురంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. మండల వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణారెడ్డిని వైద్య శిబిరంలో సదుపాయాలు, శిబిరం నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. శిబిరానికి వచ్చిన రోగులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఒక బృహత్తర కార్యక్రమం అన్నారు. ఈ శిబిరాలకు వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోందన్నారు. వేలాది రూపాయల విలువైన ఏడు రకాల పరీక్షలు ఈ శిబిరాల్లో నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో ఈ వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. సాధారణ వ్యాధులతోపాటు, గుండె జబ్బులు, కిడ్నీ, చిన్నపిల్లల సమస్యలు, ఆర్థో సమస్యలతో బాధపడేవారు, కంటి సమస్యలతో బాధపడే వారు కూడా ఈ శిబిరాలకు రావడంతో వారందరికీ పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యులతో పాటు, జిల్లా కేంద్రం నుంచి మరో ఇద్దరు వైద్య నిపుణులను ఈ వైద్యశిబిరాల్లో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు దేవరాపల్లి మండలంలోని కాశీపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించారు. హెల్త్ క్యాంప్‌లో మందులు, బీపీ, సుగర్, రక్త పరీక్షల శిబిరాలతో పాటు టోకెన్ జారీని పరిశీలించి అక్కడ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్య పరీక్షలు చేసుకున్న వారికి కేష్‌షీట్‌తో పాటు మందులను అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్స్‌ను తిలకించారు. రావికమతం మండలం తోటకూరపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పరిశీలించారు. వైద్యులకు పలు సూచనలు చేశారు. వలంటీర్లు, గృహసారథులు సాయంత్రం వరకు సేవలందించాలన్నారు.



డీఎల్ పురం వైద్యశిబిరంలో మందుల కౌంటర్ పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్

మంచి రోజులు వచ్చాయి



నాకు బీపీ, సుగర్, కీళ్ల నొప్పులు ఉన్నాయి. కస్నూరు పాలెం వెళ్లి పరీక్షలు చేయించుకుని మందులు కొని తెచ్చుకొంటున్నాను. వ్యయప్రయాసతోపాటు ఎన్నో ఇబ్బందులు పడేదానిని. జగన్‌బాబు మా పంచాయతీకే డాక్టర్లను తీసుకొచ్చి పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందిస్తున్నారు.

–రెడ్డి కన్నతల్లి, తోటకూరపాలెం, రావికమతం

ఎంతో ఉపయోగకరం



గతంలో గుండెకు బైపాస్ ఆపరేషన్ చేయించుకున్నాను. జగనన్న ఆరోగ్య సురక్షలో బీపీ, సుగర్ పరీక్షలు జరిపించుకొని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నాను. ఉచితంగా మందులు అందజేశారు. శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంది.

–షేక్ నేమతుల్లా, ముస్లిం వీధి, కశింకోట



మారేడుపూడిలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు



దేవరాపల్లి మండలం కాశీపురంలో వైద్య సేవలు పొందిన వారికి కేస్ షీట్‌ను అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



కశింకోటలోని డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో వైద్యపరీక్షలకు బారులు తీరిన ప్రజలు

అయ్యన్న నోటి దురుసు

- బ్రాహ్మణిని అవమానకరంగా మాట్లాడిన బూతుల నేత
- మహిళలంటే చులకన భావం తగదని అయ్యన్నపై విమర్శలు
- అది నోరేనా.. అని సొంత పార్టీ నాయకుల రుసరుసలు
- అసభ్య ప్రసంగం వైరల్ కావడంతో తలలు పట్టుకుంటున్న కేడర్

దాని పేరేమి పేరు..
అని బ్రాహ్మణి గురించి ప్రస్తావన..
లోకేష్ భార్య బాలకృష్ణ
చిన్న కూతురా..
పెద్ద కూతురా.. అని వ్యాఖ్య
పేరు గుర్తుకురాక
మీడియా ముందు నానా తంటాలు..
అవాక్కయి బిత్తర చూపులు చూసినటీడీపీ నేతలు..



ఇదీ మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు మీడియాతో అసభ్యంగా, అడ్డదిడ్డంగా మాట్లాడిన మాటల పర్యవసానం. టీడీపీలో మహిళలకు గౌరవం లేదన్న విషయం చర్చనీయాంశం అయిన దశలో.. అయ్యన్న అవాకులు చవాకులు మరింత నష్టం చేకూరుస్తాయని సొంత పార్టీ వారే నొసలు చిట్లిస్తున్న వైనం..

సాక్షి, అనకాపల్లి: ఎప్పుడూ ఏదో ఒక వివాదంలో కనిపించే మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు నోటి దురుసుతనం మరోసారి సంచలనమైంది. ఈసారి స్వయానా టీడీపీ అధినేత చంద్రబాబు కోడలు, చినబాబు లోకేష్ భార్య, బాలకృష్ణ పెద్ద కూతురు బ్రాహ్మణినే అవమానిస్తూ..హేళన చేస్తూ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా నర్సీపట్నం టౌన్‌లో ఏర్పాటు చేసిన టీడీపీ మహిళా దీక్షా కార్యక్రమంలో అయ్యన్న మీడియాతో మాట్లాడుతూ.. 'బాలకృష్ణ చిన్న కూతురా.. లేదా పెద్ద కూతురా.. దాని పేరేమి పేరు..' అంటూ తన సహజసిద్ధమైన రీతిలో అసహ్యకరంగా మాట్లాడారు. ప్రస్తుతం టీడీపీలో కీలకపాత్ర పోషిస్తున్న నారా బ్రాహ్మణి పేరు గుర్తుకురాక మీడియా ముందు అయ్యన్న నానా తంటాలు పడ్డారు. ఒక సీనియర్ మాజీ మంత్రి అలా అవహేళన చేసి మాట్లాడడంతో అక్కడున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు బిత్తర చూపులు చూస్తూ ఉండిపోయారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాష్ట్రవ్యాప్తంగా తెలుగు తమ్ముళ్లు అయ్యన్నపై గుర్రుగా ఉన్నారు. చంద్రబాబుని జైలు పాలు చేసిన స్కిల్ స్కాంకు తనకు ఎటువంటి సంబంధం లేదని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చెప్పకనే చెప్పారు. ఇప్పుడు మరో సీనియర్ నేత అయ్యన్న అధినేత కోడలినే హేళన చేసి మాట్లాడారు. ఇవన్నీ చూస్తుంటే టీడీపీ మాజీ మంత్రులు, సీనియర్ నేతలకు పార్టీ అధిష్టానంపై ఎంత గౌరవం ఉందో అర్థం అవుతోంది. ఇక సొంత పార్టీలోనే కొందరు టీడీపీ మహిళా నేతలు.. అయ్యన్నపాత్రుడికి ఆడవారిని గౌరవించడం రాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయ్యన్నపాత్రుడు నోటి దురుసుకు చెక్ పెట్టకపోతే పార్టీ నష్టపోయే ప్రమాదముందని సీనియర్ నేతలు మధనపడుతున్నట్టు సమాచారం. ఇప్పటికే ఇద్దరు సీనియర్ మాజీ మంత్రులు మాట తూలారు. క్రమశిక్షణ తప్పారు. భవిష్యత్తులో మరింతమంది తలో రకంగా వ్యవహరిస్తే పార్టీ మరింత కష్టాల్లో పడుతుందన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

నేషనల్ లైవ్ స్టాక్ మిషన్‌తో స్వయం ఉపాధి

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ఉపయోగించుకుని జిల్లాలో రైతులు, నిరుద్యోగులు స్వయం ఉపాధి పథకం ద్వారా అభివృద్ధి చెందవచ్చని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. స్థానిక పెంటకోట కన్వెన్షన్ హాల్లో పశుసంవర్ధక శాఖ ఏర్పాటు చేసిన నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ అవగాహన సదస్సును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ లైవ్ స్టాక్ మిషన్ 2025–26 ఆర్థిక సంవత్సరం వరకు గొర్రెలు, మేకలు పెంపకందారులకు రూ.25 లక్షల నుంచి 50 లక్షల వరకు సబ్సిడీ పొందవచ్చన్నారు. రైతులు, నిరుద్యోగులు ఇటువంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ సబ్సిడీ రుణాల కోసం ఆన్‌లైన్లోనే ఉచితంగా దరఖాస్తు చేసుకుని విధానం ఉందని, రైతు కుటుంబాలు ముందుకు రావాలన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.ప్రసాదరావు మాట్లాడుతూ మేకలు, గొర్రెలు పెంపకం యూనిట్ మొత్తం రూ.కోటి రుణానికి రూ.50 లక్షల సబ్సిడీ, కోళ్ల అభివృద్ధి పథకం ప్రాజెక్టు రూ.50 లక్షలకుగాను రూ. 25 లక్షలు, పందుల పెంపకం రూ.60 లక్షలకుగాను రూ.30 లక్షలు, దాణా తయారీ ప్రాజెక్టు రూ.కోటి రుణానికి రూ. 50 లక్షలు సబ్సిడీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏడీ డాక్టర్ ఎం.ప్రసాదరావు, విశాఖపట్టణం డివిజన్ డీడీ డాక్టర్ ఎస్.కరుణాకరణ్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ బి.రామ్మోహన్, నర్సీపట్నం డీడీ డాక్టర్ సీహెచ్.నరసింహులు, సమగ్ర జీవాల అభివృద్ధి సంస్థ ఏడీ డాక్టర్ ఎస్.శ్రీనుబాబు, రైతులు పాల్గొన్నారు.

ఐటీఐలలో ఐదో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు


నర్సీపట్నం: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో మిగులు సీట్ల భర్తీకి ఐదో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి తెలిపారు. విద్యార్థులు ఏ ఐటీఐలో ప్రవేశం పొందాలనుకుంటున్నారో ఆ ఐటీఐకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 7వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అప్లికేషన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. 8న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు ఈనెల 9న ప్రభుత్వ ఐటీఐలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు ట్రైనింగ్ ఆఫీసర్లు టి.చక్రపాణి, డి.చంద్రశేఖర్‌లను 9491813637, 7013737243 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఆవుదూడ.. ఆర్థిక అండ!

- పెయ్యల సంతానోత్పత్తికి ప్రోత్సాహం
- రాయితీపై రూ.500కే కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్
- జిల్లాలో 3,500 ఆవులు, గేదెలకు వేయాలని లక్ష్యం
- జిల్లాలో 50కిపైగా ఆడపెయ్యల జననం



లేగదూడల ప్రదర్శనలో పెయ్యలు



ఇంజక్షను ద్వారా జన్మించిన పెయ్య

నాతవరం: ఆవుదూడల సంతానోత్పత్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీని ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేలా పాడి రైతులను ప్రోత్సహిస్తోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ పాలిచ్చే మేలుజాతి పశువులు అధిక ఆదాయాన్ని ఇస్తుంటాయి. వీటి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లి కొనుగోలు చేయడానికి వ్యయప్రయాస పడకుండా మన రాష్ట్రంలోనే మన పశువులకే సంకరజాతి పెయ్యలు జన్మించేందుకు రాయితీపై కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు (వీర్యం) సరఫరా చేస్తోంది. ఈ పథకం గతేడాది అక్టోబరులో ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో మొదటగా 3,500 ఇంజక్షన్లు (ముర్రా, జెర్సీ, హెచ్.ఎఫ్, జెర్సీక్రాస్, హెచ్.ఎఫ్, క్రాస్, గిర్, సాహివాల్ రకాల జాతుల లింగ నిర్ధారణ వీర్యం) ఆవు లేదా గేదెలకు చేసేందుకు లక్ష్యాన్ని విధించింది. వీటిని ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా రైతుల కల్లాల వద్దకే గోపాలమిత్రలు వెళ్లి పశువులు ఎదకు వచ్చినప్పుడు వేస్తున్నారు.

ఇప్పటికే 196 మంది గోపాలమిత్రలతో 2,500 ఇంజక్షన్లు

జిల్లాలో 197 మంది గోపాలమిత్రులు పని చేస్తున్నారు. ఇంతవరకు 2500పైగా కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు పశువులకు చేయగా, ప్రస్తుతం 50పైగా పశువులు ఆడ పెయ్యిలు జన్మించాయి. ఈ ఇంజక్షను చేసిన ఆవు లేదా గేదె కచ్చితంగా ఆడ పెయ్య జన్మిస్తుంది. ఇటీవల నాతవరం మండలం వెంకయ్యపాలెం, గోవిందపురం, జిల్లేడుపూడి గ్రామాల్లో అధిక శాతం పశువులకు పెయ్యలు జన్మించాయి. రైతులు ఆయా పెయ్యిల కోసం గతంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లి కొనుగోలు చేసేవారు. తమ కల్లాల వద్దే అటువంటివి పుట్టడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాయితీపై ఇంజక్షన్ల సరఫరా

పాడి పశువులకు పెయ్యలు జన్మించేందుకు ఇంజక్షన్లు రాయితీపై ప్రభుత్వం రైతులకు సరఫరా చేస్తోంది. ఇంజక్షను ఖరీదు రూ.1350 కాగా, రైతుకు కేవలం రూ.500కే ఇస్తున్నారు. పశువు ఎదకు వచ్చినప్పుడు ఫోన్ ద్వారా గోపాలమిత్రకు సమాచారం ఇస్తే రైతు కల్లాం వద్దకు వచ్చి ఇంజక్షను చేస్తారు. ఇంజక్షనుతో జన్మించిన సంకర జాతి పశువులు అధిక పాలిస్తాయి. ఈ నేపథ్యంలో విశాఖ డెయిరీకి పాలు సరఫరా చేసే ఉత్పత్తిదారులకు ఇంజక్షన్ రూ.250కే ఇస్తామని సంబంధిత చైర్మన్ ఆడారి ఆనంద్ ప్రకటించారు.

లేగదూడల ప్రదర్శనలకు నిధుల మంజూరు

పాడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ఏడాది జిల్లాలో 50పైగా లేగదూడల ప్రదర్శనలు ఏర్పాటు చేసేందుకు రూ.5 లక్షలు మంజూరు చేసింది. ఇంతవరకు 20పైగా లేగదూడల ప్రదర్శనలు ఏర్పాటు చేసి, పాడి రైతులకు ప్రోత్సాహకాలు అందించారు. వచ్చే నెల మరో 30 లేగదూడల ప్రదర్శనల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశారు. వీటి ద్వారా పశువుల పెంపకం, ఆరోగ్యపరమైన అంశాలపై పశువైద్యులు రైతులకు అవగాహన కల్పించి చైతన్య పరుస్తున్నారు.


రైతులు సద్వినియోగం చేసుకోవాలి



పాడి రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలి. రాయితీపై పెయ్యలు జన్మించే ఇంజక్షన్లు, లేగదూడల ప్రదర్శనకు ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందిస్తుంది. గోపాలమిత్రలతోపాటు రైతు భరోసా కేంద్రంలో పశుసహాయకులు రైతులకు అందుబాటులో ఉంటారు.

–రామ్మోహన్‌రావు, పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి, ఉమ్మడి జిల్లా

సీఎంకు రుణపడి ఉంటాం



పెయ్యలు జన్మించే ఇంజక్షన్లు రైతులకు సరఫరా చేయాలని 1998 నుంచి గత ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాం. ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీటిని రాయితీపై పాడి రైతులు అందించడంతో ఇతర రాష్ట్రాలకు చెందిన జాతుల పెయ్యలు ఇక్కడే జన్మిస్తున్నాయి. నేను ఏటా 40 నుంచి 60 పశువులు ఇతర రాష్ట్రాల్లో కొనుగోలు చేసేవాడిని. ఇకనుంచి ఆ పరిస్థితి ఉండదు. జగన్‌కు రైతులంతా రుణపడి ఉంటాం.

–దస్తాల రాఘవేంద్రరావు, రాష్ట్ర ఉత్తమ పాడిరైతు

రైతుల వద్ద గౌరవం పెరిగింది



పెయ్యలు జన్మించేందుకు ఇంజక్షన్లు రాయితీపై సరఫరా చేయడంతో పాడి రైతుల వద్ద గోపాలమిత్రలకు గౌరవ పెరిగింది. మా ప్రాంతంలో గతేడాది చేసిన ఇంజక్షన్లతో పశువులకు పెయ్యిలు జన్మించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెయ్యి పుడితే రూ.లక్ష ఆదాయం వచ్చినట్లుగా సంతోషిస్తున్నారు.

–కిల్లాడ వెంకటరమణ, గోపాలమిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లేడుపూడి, నాతవరం మండలం

క్లుప్తంగా

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బొలెరో

రాంబిల్లి: సంతపాలెం సమీపంలో మంగళవారం తెల్లవారుజామున బొలెరో వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం నేలకొరిగింది. విద్యుత్ సిబ్బంది స్పందించి సరఫరా నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. సుమారు 8 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. క్రేన్ సాయంతో విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టి, సరఫరాను పునరుద్ధరించారు.

మృతదేహంతో వెళ్తున్న అంబులెన్స్ బోల్తా



వేంపాడు సమీపంలో బోల్తాపడిన అంబులెన్స్

నక్కపల్లి: కాకినాడ నుంచి విజయనగరం మృతదేహంతో వెళ్తున్న అంబులెన్స్ బోల్తాపడింది. మంగళవారం కాకినాడలో మరణించిన వ్యక్తిని తీసుకుని అంబులెన్స్ సాయంతో బంధువులు విజయనగరం బయలుదేరారు. వేంపాడు పెట్రోలు బంక్ సమీపంలో అంబులెన్స్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో రోడ్డుపై బోల్తాపడింది. అంబులెన్స్‌లో మృతదేహంతో పాటు ఆరుగురు వ్యక్తులు ఉన్నారు. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. పోలీసులు వేరొక అంబులెన్స్‌లో మృతదేహాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

15న హాఫ్ మారథాన్



పోస్టర్ విడుదల చేస్తున్న ఏఎంసీ నిర్వాహక కమిటీ

విశాఖ స్పోర్ట్స్: ఆర్.కె.బీచ్‌లోని కాళీమాత ఆలయం నుంచి రన్ ఫర్ హెల్త్ పేరిట ఈ నెల 15న హాఫ్ మారథాన్ జరగనుంది. ఆంధ్రా మెడికల్ కళాశాల శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ పరుగు నిర్వహిస్తున్నట్లు ఏఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిబాబు తెలిపారు. ఏఎంసీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఈ వివరాలను ఆయన వెల్లడించారు. హాఫ్ మారథాన్‌తో పాటు 3కే, 5కే, 10కే పరుగును కాళీమాత ఆలయం నుంచి ప్రారంభిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి టీషర్ట్‌తో పాటు విజేతలకు లక్ష రూపాయల బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. https://amc100yearsrun.iq301.com/ లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. క్రీడల వైస్ ప్రెసిడెంట్ ఆర్.సునీల్‌కుమార్, నిర్వాహక కమిటీ ప్రతినిధులు కృష్ణవేణి, శ్వేతారావులతో కలిసి పోస్టర్, టీషర్ట్‌ను విడుదల చేశారు.

నేటి నుంచి మెయిన్ రోడ్డు విస్తరణ

మార్కింగ్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గణేష్



మార్కింగ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



రోడ్డు విస్తరణకు మార్కింగ్ చేస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది

నర్సీపట్నం: మెయిన్ రోడ్డు విస్తరణ పనులు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి ఇచ్చిన మార్కింగ్ పనులను పార్టీ నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెయిన్ రోడ్డు విస్తరణ పనులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలోనే శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రోడ్డు విస్తరణ, డ్రైనేజీ నిర్మాణానికి రూ.8.30 కోట్లు, సెంట్రల్ లైటింగ్, గ్రీనరీ ఏర్పాటుకు రూ.2.30 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయినట్లు వెల్లడించారు. దీంతో పాటు నర్సీపట్నం వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెదబొడ్డేపల్లి వరకు ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణానికీ రూ.6 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ పనులకు సంబంధించి వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. మెయిన్ రోడ్డు విస్తరణ బాధితులు 200 మంది భవన యజమానులు ఉండగా, వీరిలో 110 మంది టీడీఆర్ బాండ్లు తీసుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారన్నారు. వీరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కొంత మంది కోర్టుకు వెళ్లారని, వారికి టీడీఆర్ బాండ్లు లేదా, ల్యాండ్ అక్విజేషన్ జరిపి నష్టపరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించిందన్నారు. ఈ కేటగిరీలో ఉన్న 92 మంది నుంచి స్థల సేకరణకు పత్రికా ప్రకటన ఇచ్చామన్నారు. అభ్యంతరాలేమైనా ఉంటే తెలిపేందుకు రెండు మాసాల గడువుందన్నారు. అబీద్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ఎలాంటి ఇబ్బందులు లేనందున, ముందుగా 800 మీటర్ల పొడవున రోడ్డు విస్తరణ చేపడతామన్నారు. భవన యజమానులు, రాజకీయ పార్టీ నాయకులు రోడ్డు విస్తరణకు కలిసిరావాలని ఎమ్మెల్యే కోరారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏకాశివ, మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఉన్నీషా బేగం, అర్జున్ వెంకట్రావు, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా, లగుడు స్వామి, నూలకాలమ్మ ఆలయ చైర్మన్ ధనిమిరెడ్డి నాగు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు లోకవరపు శారద, లలిత, కణితి అన్నపూర్ణ, స్థానిక నాయకులు కర్రి రాంగోపాల్, అరుగుల్ల రాజుబాబు, యూత్ అధ్యక్షుడు ధనిమిరెడ్డి ప్రసాద్ ఉన్నారు.

గ్రానైట్ క్వారీ నిర్వాహకులపై మహిళ ఫిర్యాదు



విప్ ధర్మశ్రీకి పిర్యాదు చేస్తున్న మహిళ అప్పలరాజు

రావికమతం: తమ భూమిలో గ్రానైట్ క్వారీ వ్యర్థాలను వేసి, సాగుకు పనికి రాకుండా చేసి, తమకు నెల నెలా ఇస్తామన్న సహాయాన్ని కూడా ఇవ్వడం లేదంటూ తోటకూరపాలేనికి చెందిన చిన్నంరెడ్డి అప్పలరాజు అనే మహిళ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి గ్రామ సభలో మంగళవారం పిర్యాదు చేశారు. గ్రామంలోని వెంకట గిరీష గ్రానైట్ క్వారీ నిర్వాహకులు అప్పలరాజుకు చెందిన 2.90 ఎకరాల భూమిలో క్వారీ వ్యర్థాలు వేస్తున్నారు. దీన్ని ఆమె వ్యతిరేకించడంతో కిస్తీకి మాట్లాడుకున్నారు. ఆమె భర్త ఎర్రినాయుడిని వాచ్‌మన్‌గా నియమించారు. ఆయన అక్కడ విధి నిర్వహణలో ఉన్నపుడే పాముకాటుకు గురై మరణించాడు. దీనికి యాజమాన్యం నష్ట పరిహారంతోపాటు, ప్రతి నెలా రూ.3 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఇపుడు మాట తప్పి, అడిగితే దిక్కున్న చోట చెప్పుకోమంటూ గెంటేశారని ఆమె వాపోయింది. తనకు న్యాయం చేయమంటూ ధర్మశ్రీకి మొరపెట్టుకుంది. దీంతో అక్కడే ఉన్న తహసీల్దార్ మహేశ్వరరావును పిలిచి, తక్షణం పరిశీలించి, చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు.

నేడు మాడుగులలో 'జగనన్నకు చెబుదాం'

తుమ్మపాల: ఈ నెల 4వ తేదీన మాడుగుల మండల కేంద్రంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఇతర జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

2500 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



బెల్లం పులుపు డ్రమ్ములతో స్థానిక ఎస్‌ఐ నాగేంద్ర, సిబ్బంది.

దేవరాపల్లి: దేవరాపల్లి మండలం ముషిడిపల్లి శివారు ప్రాంతంలో గుట్టుగా సాగుతున్న సారా తయారీ కేంద్రంపై స్థానిక ఎస్‌ఐ డి.నాగేంద్ర తన సిబ్బందితో కలిసి మంగళవారం మెరుపుదాడి నిర్వహించారు. ఈ దాడిలో సుమారు 500 లీటర్ల సారా తయారీకి సిద్ధం చేసిన 2,500 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. ముషిడిపల్లి నాగారాయుడు చెరువుకు సమీపంలో ఉన్న సారా స్థావరంపై పక్కా సమాచారంతో అతి కష్టంగా సిబ్బందితో కలిసి చేరుకుని, 10 డ్రమ్ముల్లో ఉన్న బెల్లం పులుపును పారబోసి, ఇతర సామగ్రిని నాశనం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నాగేంద్ర మాట్లాడుతూ సారా తయారీ చేస్తూ పట్టుబడితే ఎంతటి వారికైనా జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. సారా తయారీలో పాల్గొన్నవారితోపాటు, సహకరించిన వ్యక్తులు, భూయజమానిపైనా కేసులు నమోదు చేస్తామన్నారు. సారా నిర్మూలనకు ప్రజలు సహకరించాలని కోరారు. సమాచారమిచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ దాడిలో కొల్లి ప్రసాద్, పి.సూరిబాబు, కె.ప్రసాద్ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చినగుమ్మలూరులో పట్టపగలే చోరీ



చోరీ జరిగిన ఇంట్లో వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

ఎస్.రాయవరం: మండలంలోని చినగుమ్ములూరు గ్రామంలో పట్టపగలే చోరీ జరిగి రూ.45 వేల నగదు, మూడు తులాల బంగారం, 10 తులాల వెండి పట్టీలు దోచుకెళ్లినట్లు ఎస్‌ఐ ప్రసాదరావు మంగళవారం తెలిపారు. గ్రామంలో గాడి నూకరత్నం, బొండా సత్యవతి ఇళ్లలో దొంగలుపడి బీరువాల్లో వస్తువులు, నగదు చోరి చేసినట్టు పేర్కొన్నారు. వ్యవసాయ పనులపై వారు బయటకు వెళ్లడంతో దొంగలు చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు. ఈ చోరీల్లో గాడి నూకరత్నంకు చెందిన నగదు రూ.32,400, పావు తులం చెవి దుద్దులు, బొండా సత్యవతికి చెందిన నగదు రూ.13,500, రెండున్నర తులాల బంగారు వస్తువులు, 10 తులాల వెండి వస్తువులు పోయినట్లు ఫిర్యాదు అందిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇకపై డిజిటల్ కార్డులే!

- ఆరు నెలలుగా నిలిచిన డీఎల్, ఆర్‌సీ కార్డుల జారీ
- ఇలాంటివి జిల్లాలో సుమారు 15 వేలు
- వీటి పంపిణీకి రవాణా శాఖ సన్నాహాలు
- రెండు మూడు రోజుల్లో ముద్రణ మొదలు
- డిజిటల్ కార్డుల రాకతో ఫీజు వసూలుకు స్వస్తి



డిజిటల్ డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్

సాక్షి, విశాఖపట్నం: రవాణా శాఖ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. దీంతో డ్రైవింగ్ లైసెన్సు (డీఎల్), వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ) కార్డుల జారీ సులభతరం కానుంది. ఇకపై పాత (ప్లాస్టిక్) కార్డుల జారీ నిలిచిపోనుంది. వాటి స్థానంలో డిజిటల్ రూపంలోనే అందుబాటులోకి రానున్నాయి. దాదాపు ఆరు నెలలుగా రవాణా శాఖ ఈ కార్డులను జారీ చేయడం లేదు. విశాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (డీటీసీ) పరిధిలో రోజుకు సగటున 150 వరకు ఆర్సీలు, డ్రైవింగ్ లైసెన్సులు జారీ అవుతుంటాయి. ఇలా గత ఆరు నెలల్లో 15 వేల వరకు ఈ కార్డులను పంపిణీ చేయాల్సి ఉందని అంచనా వేస్తున్నారు. కార్డుల ముద్రణకు వీలుగా రవాణా శాఖ ప్రింటర్లను సిద్ధం చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో వీటి ముద్రణ ప్రక్రియను పాత విధానంలో చేపట్టనున్నారు. అనంతరం దశలవారీగా ఈ కార్డులను ఇప్పటికే ఫీజు సొమ్ము చెల్లించిన సంబంధిత వ్యక్తుల చిరునామాలకు పోస్టల్ ద్వారా పంపించనున్నారు. అప్పటి వరకు ట్రాఫిక్ పోలీసులు గాని, రవాణా శాఖ అధికారులు గాని తనిఖీ చేసేటప్పుడు డిజిటల్ ఫార్మాట్‌లో ఉన్న కార్డులను చూపిస్తే సరిపోతుందని రవాణా శాఖ ఉప కమిషనర్ జీసీ రాజారత్నం తెలిపారు. మొబైల్ ఫోన్ లేని వారు కార్డులను ప్రింట్ చేయించుకుని తమతో పాటు ఉంచుకోవాలని ఆయన కోరారు.

నిలిచిన ఫీజులు వసూలు

ఇప్పటివరకు డ్రైవింగ్ లైసెన్స్/ఆర్సీ కార్డు జారీకి ఫీజు కింద రూ.200, పోస్టల్ చార్జీ కింద రూ.25 చొప్పున రవాణా శాఖ వసూలు చేస్తోంది. ఈ మొత్తం చెల్లించిన వారికి సంబంధిత కార్డులను పోస్టల్ ద్వారా పంపిస్తోంది. అయితే జులై 29 నుంచి ఈ ఫీజుల వసూలును నిలిపి వేసింది. మరోవైపు విశాఖ జిల్లాలో గతంలో ముద్రించిన కార్డులను పోస్టల్ ద్వారా పంపిస్తే ఆ చిరునామాల్లో సంబధిత వ్యక్తులు అందుబాటులో లేకపోవడంతో వాటిలో కొన్ని వెనక్కి వచ్చేశాయి. ఇప్పుడు 2022 ఆగస్టు నుంచి 2023 ఆగస్టు వరకు ఈ కార్డులు అందని వారి కోసం తమ ఆధార్ కార్డులతో వచ్చి రవాణా శాఖ కార్యాలయాల్లో తీసుకునే వెసులుబాటు కల్పించారు.

ఇక డిజిటల్ రూపంలో..

కొత్త నిబంధనల ప్రకారం డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీ కార్డుల స్థానంలో డిజిటల్ రూపంలోజారీ కానున్నాయి. ఇక మీదట వీటి కోసం ఎవరూ ఆర్టీవో కార్యాలయాలకు వెళ్లాల్సిన పనిలేదు. కార్డుల జారీకి ఫీజు చెల్లించనక్కర్లేదు. ఇందుకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్) రూపొందించిన sasathipasivahan. gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది. నిర్ణీత వ్యవధిలో డిజిటల్ కార్డు జారీ అవుతుంది. వీటిని డిజి లాకర్‌లోనూ భద్రపరచుకోవచ్చు. ప్లాస్టిక్ కార్డుపై ముద్రించుకోవచ్చు. ప్రభుత్వం తీసుకున్న సరికొత్త నిర్ణయంతో డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీ కార్డులు పొందే వారికి ఫీజు భారం తప్పుతుంది. వీటి జారీ కూడా సులభతరం అవుతుండడంతో వాహనదారులకు ఊరట లభించనుంది.

వలంటీర్లూ.. శభాష్



లక్ష్మికి వితంతు పింఛన్ నగదు అందిస్తున్న వలంటీర్ అప్పారావు



కేజీహెచ్‌లో బాధితురాలికి పింఛన్ నగదు ఇస్తున్న వలంటీర్ సతీష్



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో రోగికి పింఛను అందిస్తున్న వలంటీరు

కె.కోటపాడు/రావికమతం: వలంటీర్లు తమ బాధ్యతల పట్ల నిబద్ధతను చాటుకుంటున్నారు. తమ పరిధిలో పింఛన్ లబ్ధిదారులు అందుబాటులో లేకుంటే, వారి పరిస్థితిని ఆరా తీసి మరీ, వారున్న చోటుకే వెళ్లి పింఛన్ నగదు అందించి, బాసటగా నిలుస్తున్నారు. కె.కోటపాడు మండలం చౌడువాడకు చెందిన చిన్ని లక్ష్మి అనారోగ్యం బారినపడి నాలుగు రోజులుగా కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. వితంతువైన లక్ష్మికి పింఛన్ నగదును వలంటీర్ అప్పారావు తన సొంత ఖర్చులతో విశాఖలోని కేజీహెచ్‌కు వెళ్లి అందించారు. రావికమతం మండలం దొండపూడికి చెందిన యక్కలదేవి లక్ష్మి అనారోగ్యంతో కేజీహెచ్‌లోనే చికిత్స పొందుతోంది. దీంతో వలంటీర్ మేడపాటి సతీష్ మంగళవారం ఆస్పత్రికి వెళ్లి ఆమెకు పింఛన్ నగదును అందించారు. వలంటీర్ల నిబద్ధతను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, స్థానికులు అభినందించారు.

కోటవురట్ల: రామచంద్రపురం గ్రామానికి చెందిన చవ్వాకుల జోగమ్మ అనారోగ్యం కారణంగా నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో కొంత కాలంగా చికిత్స పొందుతోంది. పింఛన్ అందుకునేందుకు గ్రామంలో లేకపోవడంతో విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు చవ్వాకుల చిన్న, వలంటీరు పంచదార్ల కార్తీక్‌లు ఆస్పత్రికి వెళ్లి పింఛను నగదు అందించారు. తన పరిస్థితి తెలుసుకుని, నేరుగా ఆస్పత్రికే వచ్చి పింఛన్ అందించడంపై లబ్ధిదారు జోగమ్మ కృతజ్ఞతలు తెలిపింది.

సీఎం రిలీఫ్ ఫండ్ రూ.10 లక్షలు అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: పేదరికంతో మెరుగైన వైద్యం పొందలేని స్థితిలో ఉన్న రోగులకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంగా మారి, సంపూర్ణ ఆరోగ్యం పొందేందుకు దోహదపడుతోందని డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఎస్.రాయవరం మండలం సర్వసిద్ధి గ్రామానికి చెందిన జి.ప్రకాష్ ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు. శస్త్ర చికిత్సతో పాటు మెరుగైన వైద్యానికి ఆరోగ్యశ్రీ సరిపోలేదు. దీంతో తన ఇబ్బందిని డిప్యూటీ సీఎంకు వివరించారు. ఆయన ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బాధితునికి మెరుగైన వైద్యం అందించేందుకు రూ.10 లక్షలను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైంది. ఈ చెక్‌ను మంగళవారం గవరపాలెంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా ప్రకాష్ అందుకున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ నగదు మంజూరు చేయించిన డిప్యూటీ సీఎంకు లబ్ధిదారుడు ప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, సర్పంచ్ తోట భవాని, కనకరాజు, ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు, మాజీ సర్పంచ్ నెక్కల పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన జగనన్న ఇళ్ల నిర్మాణం

- మౌలిక వసతుల కల్పనకు చర్యలు
- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- వెన్నలపాలెం జగనన్న కాలనీ సందర్శన



వెన్నలపాలెం జగనన్న కాలనీలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

పరవాడ: ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు కేటాయించిన జగనన్న కాలనీల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. వెన్నలపాలెంలో నిర్మాణ దశలో ఉన్న జగనన్న కాలనీని కలెక్టర్ రవి మంగళవారం సందర్శించారు. కాలనీలో నిర్మాణ పనులను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణశాఖ అధికారులకు సూచించారు. అదేవిధంగా కాలనీలో రూ.41.95 లక్షలతో చేపట్టిన డ్రైనేజీలు, రహదారులు, ముఖద్వార నిర్మాణ పనులు ఈ నెల 8 నాటికి పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో చిన్నికృష్ణ, గృహ నిర్మాణశాఖ పీడీ రమామణి,మండల ప్రత్యేక అధికారి వీర్నానాయుడు, పరవాడ, వెన్నలపాలెం సర్పంచ్‌లు సిరపరపు అప్పలనాయుడు, వెన్నల అప్పారావు, వెన్నలపాలెం ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, తహసీల్దారు పి.కనకారావు, ఎంపీడీవో వి.హేమసుందరావు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ పి.విజయలక్ష్మి, డీఈలు ప్రసాద్, ఏవీవీఎస్ఎన్ రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ షణ్ముఖ, హౌసింగ్ ఏఈ రెడ్డి, పీఆర్ ఇంజినీర్ జి.రామారావు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణతో దశాబ్దాల కల సాకారం

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- రూ.7.75 కోట్లతో పనులు



శంకుస్థాపన చేస్తున్న మంత్రి అమర్‌నాథ్, చిత్రంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్, మేయర్ హరి వెంకట కుమారి

సబ్బవరం: దీర్ఘకాలంగా ఉన్న నంగినారపాడు ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష రోడ్డు విస్తరణతో నెరవేరనుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని నంగినారపాడు శివారు కొత్తూరులో రూ.7.75 కోట్ల జీవీఎంసీ నిధులతో విస్తరించనున్న రోడ్డు పనులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారితో కలిసి మంత్రి అమర్‌నాథ్ మంగళవారం రాత్రి శంకుస్థాపన చేసారు. ఈ రోడ్డును కొత్తూరు నుంచి నంగినారపాడు హైస్కూల్ వరకూ నాలుగు దశల్లో విస్తరించనున్నట్టు చెప్పారు. కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారని 10 రోజుల్లో పనులు పూర్తిస్థాయిలో ప్రారంభమై యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. రోడ్డు పూర్తయితే పరిశ్రమలకు వెళ్లే ఉద్యోగులకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. పరిసర ప్రాంతాలన్నీ నివాస యోగ్య ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతాయని చెప్పారు.

ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు గతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేసినప్పటికీ కరోనా రావడంతో విస్తరణ పనులు నిలిచిపోయాయన్నారు. ఈ రోడ్డు పూర్తి చేసిన తర్వాతే వచ్చి ఓట్లు అడగడం జరుగుతుందన్నారు.

మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు భారీ ఎత్తున అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, పార్టీ వార్డు ఇన్‌చార్జి మహలక్ష్మినాయుడు, మాజీ కార్పొరేటర్ చొప్ప నాగరాజు, సచివాలయ కన్వీనర్ సర్వసిద్ధి బోరయ్య, నాయకులు బొట్ట ముత్యాలరావు, నారపిన్ని అప్పలరాజు,చట్టి తాతారావు, మళ్ల నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బండారు వ్యాఖ్యలను ప్రజలంతా చూశారు

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సబ్బవరం: మహిళా మంత్రిపై మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఎటువంటి అనుచిత వ్యాఖ్యలు చేశారో ప్రజలంతా చూశారని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మంగళవారం 88వ వార్డు పరిధిలోని నంగినారపాడు శివారు కొత్తూరులో రూ.7.75 కోట్ల జీవీఎంసీ నిధులతో విస్తరించనున్న రోడ్డుకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మేయర్ హరి వెంకటకుమారితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా మంత్రిపై మాజీ ఎమ్మెల్యే బండారు అసభ్యకర వ్యాఖ్యల నేపథ్యంలో మహిళా కమిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారన్నారు. అతడికి కోర్టు బెయిల్ ఇవ్వడంతో న్యాయం గెలిచిందని చెప్పుకుంటున్నారని, అయితే బెయిల్ రాక జైల్లో ఉన్న చంద్రబాబు అవినీతి చేసినట్టేనని ఒప్పుకొన్నట్లే కదా అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ పేరుతో చంద్రబాబు రూ.వందల కోట్లు డబ్బులు కొట్టేశాడు కాబట్టే కోర్టు జైలుకు పంపించిందన్నారు. ఎవరు తప్పుచేసినా శిక్ష తప్పదని తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష

కశింకోట: స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష ప్రజాదరణ లభించింది. 1వ సచివాలయం పరిధి ప్రజలకు నిర్వహించిన శిబిరంలో 394 మందికి వైద్య సేవలు అందించారు. వీరిలో ముగ్గురిని ఉన్నత వైద్యం కోసం జిల్లా ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. కంటి సమస్యలతో వచ్చిన 87 మందిలో 81 మందికి కళ్లద్దాలు, ఒకరికి కేటరాక్ట్ ఆపరేషన్ అవసరమని నిర్ధారించారు.

సాయంత్రం వరకూ కొనసాగిన శిబిరం

ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన శిబిరానికి ఇంటింటి సర్వేలో ముందుగా గుర్తించిన వారితోపాటు, స్పాట్ రిజిస్ట్రేషన్‌లో పేర్లు నమోదు చేసుకున్న వారికీ వైద్య సేవలందించారు. పాఠశాలలోని తరగతి గదుల్లో ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేసి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. శిబిరంలో పీహెచ్‌సీ వైద్యులు ఎస్.తిరుపతిరావు, ఎ.మనీషా, ప్రత్యేక వైద్యులు గ్రేసీ కేథరిన్, కోట సునీల్, ఆప్తాలమిక్ అధికారి ఆనందరావులు అవసరమైన వైద్య పరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేశారు. గుండె సంబంధిత రోగులకు ఈసీజీ పరీక్షలు జరిపారు. శిబిరంలో 190 సుగర్, 174 హిమోగ్లోబిన్, 12 మలేరియా పరీక్షలు, ముగ్గురికి డెంగ్యూ, 10 మందికి మూత్రం, కఫం పరీక్షలు చేశారు. 11 మందికి ఈసీజీ తీశారు.


జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ కలగా లక్ష్మి

అందరికీ ఆరోగ్యం జగనన్న ధ్యేయం

ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతుల్ని చేయాలన్న ధ్యేయంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఏడు రకాల పరీక్షలు జరిపి, అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలిక, సీరియస్ వ్యాధిగ్రస్తులను గుర్తించి మెరుగైన వైద్యం కోసం రిఫరల్ ఆస్పత్రులకు సిఫార్సు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రత్యేక అధికారి రోజారాణి మాట్లాడుతూ ఏ చిన్న అనారోగ్య సమస్య ఉన్నా నిర్లక్ష్యం చేయవద్దన్నారు. జిల్లా ప్రొగ్రామింగ్ అధికారి జగదీష్ కార్యక్రమాన్ని, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు శిబిరంలో ఏర్పాట్లు, వైద్య సేవల్ని పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కలిగిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ, ఏవో ఎ.ఎ.ఖాన్, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్, వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీహెచ్‌ఈవో సత్యనారాయణ, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మన్ తదితరులు పాల్గొన్నారు.


మందుల పంపిణీ


కంటి పరీక్షలు


జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రొగ్రాం అధికారి జగదీష్


కంటి పరీక్షలు చేసుకునేందుకు క్యూలో ఉన్న రోగులు

అనకాపల్లిటౌన్: జన్మించిన ప్రతీ వ్యక్తి ఆరోగ్యంగా జీవించాలని, గ్రామీణ, పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో ఆరోగ్యసేవలు అందించాలనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, ఆర్డీవో ఏజే చిన్నకృష్ణలు అన్నారు. మండలంలోని మారేడుపూడి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 16 నుంచి 30 వరకు సచివాలయం పరిధిలో ఇంటింటా ఆరోగ్య సర్వే చేపట్టామన్నారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ప్రతి వ్యక్తి బీపీ, సుగర్, ఇతర రక్త పరీక్షలు చేశారని తెలిపారు. వీరిలో అనారోగ్య సమస్యలున్నవారిని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని ఎంపిక చేసి, వారి కోసం ఈ మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నలుగురు స్పెషలిస్టు వైద్యులచే వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. రోగ తీవ్రత ఎక్కువగా ఉన్నవారిని దగ్గర్లోని ప్రభుత్వ పెద్దాస్పత్రికి అంబులెన్స్‌లో తరలించామన్నారు. గతంలో గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యాధుల బారిన పడితే, పట్టణ ప్రాంతానికి వచ్చి వైద్యులను సంప్రదించేవారని, ప్రస్తుత ప్రభుత్వంలో రోగుల వద్దకే వైద్యులు వచ్చి వైద్యం అందిస్తున్నారని పేర్కొన్నారు. వైద్యశిబిరంలో 319 మంది రోగులను పరీక్షించగా ముగ్గురికి కంటి ఆపరేషన్, 92 మందిని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు వెల్లడించారు.

కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో కె.నరసింహారావు, మారేడుపూడి సర్పంచ్ సాలాపు కనకరాజు, వైద్యులు మారుతీరావు, స్పందన, వాణీ జగదీశ్వరి, రమా, తుమ్మపాల పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బి.సంఘం, 104 సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


గర్భిణిని పరీక్షిస్తున్న గైనకాలజిస్టు తిరుపతిరావు


రక్త పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు


సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ


రక్తపరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ సూరిబాబు


రోగితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి

గుండె సమస్యలకూ వైద్యం



గత కొన్నాళ్లుగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నాను. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పేరు నమోదు చేసుకున్నా. ఈసీజీ పరీక్షలు చేశారు. డాక్టర్ అన్ని వివరాలూ ఓపిగ్గా అడిగి తెలుసుకున్నారు. మూడు రకాల మందులిచ్చారు. గుండెకు సంబంధించిన వ్యాధులున్నవారికీ శిబిరంలో వైద్యంతోపాటు, మందులు అందించడం ఆనందంగా ఉంది.

– దాసరి సత్యవతి, అమరపల్లి వీధి

ఇది ప్రజల ప్రభుత్వం



ఐదు రోజులుగా జ్వరం, దగ్గుతో బాధపడుతున్నాను. స్థానికంగా ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లా. వారిచ్చిన వైద్యం పొందినా తగ్గలేదు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఉందని వలంటీర్ చెప్పారు. దీంతో ఇక్కడికి వచ్చి పరీక్షలు జరిపించుకున్నాను. అవసరమైన మందులు ఉచితంగానే ఇచ్చారు. ఇన్నేళ్ల కాలంలో ప్రజల్ని ఇంతగా పట్టించుకున్న ప్రభుత్వాన్ని చూడలేదు.

-కాండ్రేగుల పెద అప్పారావు, కాళ్ల వారి వీధి, కశింకోట.

క్లుప్తంగా

దేమునిగుమ్మం వేంకటేశుని హుండీ లెక్కింపు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అనకాపల్లిటౌన్: స్థానిక దేమునిగుమ్మం శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు మంగళవారం చేపట్టారు. 42 రోజులకు గాను రూ.2,56,842లు ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ పర్యవేక్షణ అధికారి ఆర్‌వీఎస్ఎస్ గౌరీ, ఈవో కె.ఆదినారాయణ వెల్లడించారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సకలా రాజ్యలక్ష్మి, ధర్మకర్తలు ఉమ్మిని పైడిరాజు, సుంకర వెంకటేశ్వరరావు, శ్రీధరాల కోమలి, సూరిశెట్టి చిన్న సన్యాసిరావు, రాజాన లక్ష్మి, ఆలయ అర్చకులు పులఖండం గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష రేపు

అనకాపల్లిటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని స్థానిక విజయరామరాజుపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో గురువారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్లు జెడ్సీ ఎస్.వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీలోని 1 నుంచి 8వ సచివాలయాల పరిధిలో రోగులకు వైద్య పరీక్షలు జరిపి, అవసరమైన చికిత్స, మందులు అందిస్తామన్నారు. వైద్య బిరంలో నలుగురు స్పెషలిస్టు వైద్యులు పాల్గొంటారని పేర్కొన్నారు. సచివాలయాల పరిధిలో గతంలో టోకెన్లు పొందినవారితోపాటు, స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి కూడా వైద్య సేవలు అందిస్తామన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాల్సిందిగా కోరారు.

ఉగ్గినపాలెంలో నేడు

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెంలో బుధవారం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక వైద్య నిపుణులు, పీహెచ్‌సీ వైద్యులు హాజరై ఏడు రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని పేర్కొన్నారు. సమగ్ర ఆరోగ్య సర్వేలో దీర్ఘకాలిక రోగుల వివరాలను సేకరించి, టోకెన్లు మంజూరు చేశామన్నారు. వీరితోపాటు తాత్కాలిక అనారోగ్య సమస్యలున్న వారు కూడా రావచ్చన్నారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రులకు సిఫార్స్ చేస్తారన్నారు. ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అనకాపల్లి సినిమాలు

పెదకాపు : రాజా
స్కంద : సత్యనారాయణస్క్రీన్-1
సప్త సాగరాలు దాటి : సత్యనారాయణస్క్రీన్-2
జవాన్ (మార్నింగ్, మ్యాట్నీ)
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి (ఫస్ట్ షో, సెకండ్ షో) : షిర్డిసాయి
స్కంద : పర్తిసాయి
ఖుషి : వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్ : శ్రీసత్య
చంద్రముఖి 2 : రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 985 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,310	4,430
రెండో రకం	4,110	4,200
మూడోరకం	3,700	4,100

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 64 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, బీ పాజిటివ్-27 యూనిట్లు, ఓ పాజిటివ్-23 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 394 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 367 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

అవగాహనతోనే వరి పైరులో తెగుళ్ల నివారణ

రైతులకు ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జగన్నాథరావు సూచన

అనకాపల్లి టౌన్: రాగల ఐదు రోజుల్లో విశాఖ, అనకాపల్లి జిల్లాలో వాతావరణం మేఘావృతమై తేలిక పాటి జల్లులు పడే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాజా వాతావరణ పరిస్థితుల ప్రభావం వ్యవసాయంపై ఏ విధంగా ఉండనుందో వివరించారు.

వరి పైరులో పొడ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున లీటర్ నీటికి హెక్సాకొనజోల్ 2 మి.లీ. చొప్పున కలిపి దుబ్బు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. దుబ్బు చేసే దశలో ఎకరాకు 35 కిలోల యూరియాను వేసుకోవాలని, అంకురం దశలో 35 కిలోల యూరియాతో 17 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్‌ను వేయాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరి పైరులో ఆకు ముడత పురుగు ఆశించే అవకాశం ఉందని, జాగ్రత్తగా గమనించాలని రైతులను సూచించారు. నిర్ణీత స్థాయి(దుబ్బుకి 1 లార్వా/ 2 పురుగులు సోకిన ఆకులు) దాటితే నివారణకు ట్రైకోగ్రామా పరాన్నజీవిని ఎకరాకు 2 కార్డుల చొప్పున విడుదల చేస్తే సరిపోతుందన్నారు. ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే మొక్కలపై తాడులాగి, క్లోరిఫైరిఫాస్ మందును లీటరు నీటికి 2.5 మి.లీ. చొప్పున పిచికారీ చేయాలని తెలిపారు. పంటలో జింక్ లోపం తలెత్తితే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి పిచికారీ చేయాలన్నారు. సమావేశంలో శాస్త్రవేత్తలు సీహెచ్ ముకుందరావు, కేవీ రమణమూర్తి, ఎంబీజీఎస్ కుమారి, డి.ఆదిలక్ష్మి, ఎం.విశాలాక్షి, ఎ.శిరీష, వి.చంద్రశేఖర్, అలివేణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీవీకే జగన్నాథరావు

8 మందికి ఐవోఎల్ శస్త్ర చికిత్సలు


ఆపరేషన్ చేయించుకున్న రోగులతో రవిరామ్ జవహర్

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 8 మందికి ఉచితంగా ఐవోఎల్ శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆస్పత్రి చైర్మన్ రవిరామ్ జవహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఆస్పత్రి ఆవరణలో 35 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 8 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ చేయించుకున్న రోగులు కోలుకునేంత వరకు ఆస్పత్రిలో వసతితోపాటు, సరిపడా మందులు, ఆహారం ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యుడు కె.మల్లేశ్వరరావు, వైద్యసహాయకురాలు పి.దేవి, రోగులు పాల్గొన్నారు.

దశల వారీగా గ్రామాభివృద్ధి


గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్: దశల వారీగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని గోపాలపురం పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నివసించే ప్రజలకు చేరువగా ప్రభుత్వ సేవలు అందించేందుకు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనలో భాగంగా అవసరమైన అభివృద్ధి పనులపై చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులను సకాలంలో వినియోగించుకుని, గ్రామాభివృద్ధికి దోహదపడాలన్నారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ జెర్రిపోతుల లక్ష్మి, వార్డు సభ్యులు రమణ అప్పారావు, రామునాయుడు, ఏపీవో సుప్రియ, గ్రామ కార్యదర్శి గుణలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం సత్తిబాబు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి కుమారుడిని అరెస్ట్ చేయాలని నిరసన

పరవాడ: రైతు ర్యాలీపై కర్కశంగా వ్యవహరించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా కుమారుడిని తక్షణమే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. కిసాన్‌మోర్చా, కేంద్ర కార్మిక సంఘ ఐక్య వేదిక పిలుపు మేరకు ఫార్మాసిటీలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. గనిశెట్టి మాట్లాడుతూ ర్యాలీ చేస్తున్న రైతులను తన వాహనంతో ఢీకొట్టి నలుగురు రైతుల, విలేకరి మృతికి కారణమైన సహాయ మంత్రి కుమారుడిపై ఏడాది గడుస్తున్న ఎలాంటి చర్యలు చేపట్టలేదని నిరసన వ్యక్తం చేశారు. మూడు రైతు వ్యతిరేక చట్టాలు, విద్యుత్ సంస్కరణల చట్టాలనుమార్పు చేస్తామని హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా కేంద్రం రైతు సంఘాలతో ఎలాంటి చర్చలు జరపలేదన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయని పక్షంలో రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని గనిశెట్టి హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా కన్వీనర్ ఎ.బాలకృష్ణ, నాయకులు రొంగలి అప్పారావు, పి.తాతబాబు, ఎం.సన్యాసిరావు, శ్రీను, అక్కునాయుడు పాల్గొన్నారు.

దేవాలయ ఆవరణలో పిచ్చి మొక్కల తొలగింపు

అనకాపల్లిటౌన్: స్థానిక సుంకరమెట్ట జంక్షన్ సూర్యనారాయణ, సత్యనారాయణ స్వామి దేవస్థానం పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను ట్రాక్టర్ సాయంతో మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కర్రి మహాలక్ష్మినాయుడు మాట్లాడుతూ దేవాలయం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి, విషసర్పాలు, క్రిమికీటకాలతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సొంత నిధులతో ఈ పనులు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే భక్తులు ప్రదక్షిణలు చేసేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రానున్న కార్తీక మాసంలో స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దేవస్థానం ధర్మకర్తలు నేతల చంద్రకళ, పెంటకోట అప్పలనాయుడు, తగరంపూడి నర్సింగరావు, మారిశెట్టి శ్రీనివాసరావు, తాడి నాగలక్ష్మి, విజ్జపు ముకుంద, ఎం.విద్యాసాగర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


సూర్యనారాయణ, సత్యనారాయణస్వామి దేవస్థానంలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

5న లక్ష్మణగీత నాటక ప్రదర్శన

మునగపాక : మునగపాకలో ఈ నెల 5న మరిడి మహాలక్ష్మి అమ్మవారి పండగ సందర్భంగా 'లక్ష్మణ గీత' సాంఘిక నాటకం ప్రదర్శన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మునగపాక రామాలయం వద్ద శ్రీ లక్ష్మీ కళా యూనియన్ (పాటిదిబ్బ) ఆధ్వర్యంలో రాత్రి 9 గంటలకు ఈ నాటక ప్రదర్శన జరుగుతుందన్నారు. దాడి జగన్నాథరావు రచన, దర్శకత్వం వహిస్తుండగా, దాడి మునిలినాయుడు పర్యవేక్షణ, ఆర్గనైజర్లుగా దాడి నూక కొండలరావు, దాడి వీర వెంకట అప్పారావు వ్యవహరిస్తారు. కళాభిమానులు నాటక ప్రదర్శనను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పూడిమడక ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు.ఈ మేరకు మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థులు తెడ్డు లావణ్య,తెడ్డు రమ్యలను హెచ్ఎం శేషు, పీఈటీ మాలతీలు అభినందించారు. గత నెల 29న విశాఖపట్నంలోని ఇందిరాగాంధీ ప్రియదర్శినీ ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వారు అక్టోబర్ 15న కడపలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

నల్లమారమ్మ ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం


చెక్‌ను అందిస్తున్న వ్యాపారవేత్త వెంకటేశ్వరరావు

అనకాపల్లిటౌన్: రామాపురం పంచాయతీలోని నల్లమారమ్మ ఆలయ అభివృద్ధికి ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు రూ.లక్ష విరాళం అందించారు. స్థానిక నర్సింగరావుపేటలోని తన స్వగృహంలో దేవాలయ కమిటీ సభ్యులకు ఈ చెక్కును మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడేందుకు, ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో నల్లమారమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ అయిన అనకాపల్లి జిల్లా, అనకాపల్లి టౌన్, గవరపాలెం కాపురస్తులైన లేటు కొణతాల సన్యాసి గారి కుమారుడు కొణతాల సూరి జగ్గారావు మాకిచ్చిన భోగట్టాపై ఈ బహిరంగ ప్రకటన ఇచ్చుచున్నాను.

ఈ క్రింది వివరించబడిన షెడ్యూలు దాఖల ఆస్తి హై కోర్టులో పెండింగ్ ఉండగా బుద్ద తులసీ వెంకట నూకరాజు అతని అనుచరులు ఇతరులకు మాయమాటలు చెప్పి మభ్యపెట్టి ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని అమ్మజూపుతున్నట్లు నా క్లయింట్‌కు రూఢిగా తెలియవచ్చింది. కావున అటువంటి లావాదేవీలు ఈ దిగువ షెడ్యూలు ఆస్తి నిమిత్తం చేయరాదని, చేసినను చెల్లనేరవని, అంతియేగాక మా క్లయింట్ తీసుకునే చర్యలకు బాధ్యులు అగుదురని ఈ బహిరంగ ప్రకటన ద్వారా యావన్మందికి తెలియపరచడమైనది.

షెడ్యూలు ఆస్తి

Property to an extent of 183.748 Sq.yards of vacant site in survey no 1528/8 (old survey No. 1528/3) in RS ward, Cheruvulopala Khandam, Anakapalle, within the limits of Anakapalli Municipality and sub Registry, Visakhapatnam Revenue Division and District and bounded by: **East:** Item No 2 here in (joint way), **West:** Vacant site of Boddeda Ramarao, **North:** Vacant site property belongs to Bheesetty Venkata Kanna Rao, **South:** Vacant site property belongs to B. Subrahmanya Siva Naidu and others.

P.హర శ్రీనివాసరావు, అడ్వకేట్, అనకాపల్లి. Cell : 9912807807

నీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు

అనకాపల్లి రూరల్: తుమ్మపాల మేజర్ పంచాయతీలో పలు వీధులకు తాగు నీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైను మరమ్మతు పనులను మంగళవారం ప్రారంభించారు. ఇక్కడ పైపులైను పాడవడంతో కొన్ని రోజులుగా కొత్తపేట, మెయిన్‌రోడ్డు, కంచరపేట, గవరపేట, శివాలయం వీధి, ప్రమీలా నగర్, చిన్నయ్యపేట, వెంకుపాలెం రోడ్డు ప్రాంతాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో మంగళవారం నీటి సరఫరా పునరుద్ధరణకు పంచాయతీ పాలకవర్గం చర్యలు చేపట్టింది. కొత్తపేట వీధి సమీపంలో పైపులైనులో చెత్త పేరుకుపోవడం వల్లే నీటి సరఫరాలో ఇబ్బంది తలెత్తినట్టు గుర్తించారు. వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి, నీటి సరఫరా పునరుద్ధరించనున్నట్లు సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు తెలిపారు. మరమ్మతు పనులను ఆయనతోపాటు ఉప సర్పంచ్ చదరం చిన్న, పంచాయతీ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పర్యవేక్షించారు.


పైపులైను మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్

దుర్గమాంబ అమ్మవారికి రంగులతో ముస్తాబు



కశింకోట: కశింకోటలోని గవరపేటలో వేంచేసిన దుర్గమాంబ విగ్రహానికి రంగులు వేసి, అందంగా ముస్తాబు చేశారు. ఈ నెల 5న దుర్గమాంబ ఉత్సవం జరగనుంది. దీంతో అమ్మవారి విగ్రహానికి రెండు రోజులుగా రంగులు వేసి, తుది మెరుగులు దిద్దారు. ఉత్సవం రోజున ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలకు దర్శనం కల్పించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మ వారి ఘటాన్ని మంగళవారం గ్రామ వీధుల్లో ఊరేగించారు.

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యకర పంటలు

మునగపాక : సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయడం రైతులకు లాభసాటిగా ఉంటుందని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అన్నారు. రసాయనిక ఎరువులను వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలన్నారు. గణపర్తి హైస్కూల్లో ఐసీడీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన కూరగాయలను ఆయన పరిశీలించారు. మారుతున్న కాలంతో పాటు ప్రజలు కూడా ఆహారపు అలవాట్లను మార్చుకోవాలన్నారు. తాజా ఆహారంతో పాటు సేంద్రీయ పద్ధతిలో పండించిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు.


ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు